# మన రెండు కుటుంబాలు

## మత్తయి 12:46-50;
## మార్కు 3:20, 21, 31-35;
## లూకా 8:19-21, పరిశీలన

గలిలయ రెండవ ప్రయాణం చివరన, ప్రభువు నిర్విరామమైన రోజును గడిపారు.[1] గుడ్డి, మూగ దయ్యముపట్టిన ఒకని బాగుచేయడంతో ఆ దినం ఆరంభమయ్యింది (మత్తయి 12:22, 23). దీనితో క్రీస్తు దయ్యముల శక్తివలన దయ్యములను వెళ్ల గొడుతున్నట్టు నేరం మోపారు (మత్తయి 12:23-30). వారి నేరానికి ఆయన జవాబు చెప్పిన తరువాత, ఆయన శత్రువులు "పరలోకం నుండి ఒక సూచక క్రియ" చూడగోరారు (లూకా 11:16). సంఘర్షణతో నిండిన ఆ దినం, ఒక చిన్న సంఘటన జరిగింది. మార్కు దాన్ని యిలా తెలియజేస్తున్నాడు:

> ఆయన సహోదరులును తల్లియు వచ్చి వెలుపల నిలిచి ఆయనను పిలువనంపిరి. జనులు గుంపుగా ఆయన చుట్టు కూర్చుండిరి. వారు – ఇదిగో నీ తల్లియు నీ సహోదరులును వెలుపల ఉండి, నీకోసరము వెదకుచున్నారని ఆయనతో చెప్పగా ఆయన – నా తల్లి నా సహోదరులు ఎవరని తన చుట్టు కూర్చున్నవారిని కలయచూచి – ఇదిగో నా తల్లియు నా సహోదరులును; దేవుని చిత్తము చొప్పున జరిగించువాడే నా సహోదరుడును సహోదరియు తల్లియునని చెప్పెను (3:31-35).

ఈ భాగాన్ని మనం చదువుచుండగా, అనేక ప్రశ్నలు మనస్సుకు వస్తాయి: "దీన్ని గూర్చి చెప్పడంలో సువార్త రచయితల ఉద్దేశం ఏమైయుంటుంది?"; "ప్రభువు ఎందువలన తన కుటుంబాన్ని, ప్రత్యేకించి తన తల్లిని గుర్తించలేదు?" "ఈ సంఘటన నుండి ఏయే పాఠం లేక పాఠాలు నేర్చుకొనవలెనని దేవుడు ఉద్దేశిస్తున్నాడు?" "మన రెండు కుటుంబాలు" అనే పాఠాన్ని చదువుతుండగా, వీటికి, యింకా యితర ప్రశ్నలకూ జవాబులు కనుగొంటాం.

## క్రీస్తు యొక్క రెండు కుటుంబాలు

క్రీస్తు యొక్క రెండు కుటుంబాలతో ప్రారంభిద్దాం.

### క్రీస్తు యొక్క భౌతిక కుటుంబం

క్రీస్తు ఒక లౌకిక కుటుంబంలో జన్మించిన సంగతి మనలో అనేకులకు ఎరుకే. చట్ట ప్రకారం ఆయనకు యోసేపును తండ్రిగా ఎంచారు (మత్తయి 1:16; లూకా

3:23; యోహాను 1:45; 6:42), మరియు ఆయనకు తల్లి మరియ (మత్తయి 1:18; 2:11; 13:55; లూకా 2:34). క్రీస్తు జన్మించినప్పుడు మరియ కన్య; అయితే ఆయన జన్మించిన తరువాత, యోసేపు, మరియ భార్యభర్తలుగా జీవించారు.[2] వారికి నలుగురు కుమారులుండిరి. "యాకోబు, యోసేపు, సీమోను యూదాయను వారు" ఆయనకు సహోదరులు (మత్తయి 13:55; మార్కు 6:3 చూడు). వారికి కనీసం యిద్దరు కుమారులున్నారు (మత్తయి 13:56; మార్కు 6:3). ఈ విధంగా క్రీస్తు ప్రభువు కనీసం తొమ్మిదిమంది సభ్యులుగల కుటుంబంలో ఎదిగారు. ప్రతి సూచననుబట్టియు అది ఆనందదాయకమైన కుటుంబంగా ఉంది.[3]

తన బహిరంగ పరిచర్యను ఆరంభించడానికి ఆయన గృహాన్ని విడిచినప్పుడు, ఆయన కుటుంబ బంధుత్వాలు మారిపోయాయి. ఆయన తమ్ముళ్ళకు కొంత అసూయ ద్వేషం చోటుచేసుకుని ఉండవచ్చు. వారు ఆయనను మెస్సీయగా అంగీకరించలేదు సరిగదా, ఒక సందర్భంలో వారు ఆక్షేపించినట్టు యోహాను దాఖలు చేశాడు (యోహాను 7:3-5).[4] క్రీస్తు తల్లియైన మరియకు ఆయన ఎవరైనది స్పష్టంగా తెలుసు (లూకా 2:19, 51 చూడు), అయినా ఆయన పని ఎమైయున్నదో ఆమెకు కూడా పూర్తిగా అర్థం కాలేదు (యోహాను 2:3, 4 చూడు).

ఇది మనలను మార్కు 3లోని సంఘటనకు తోడుకొని వస్తుంది. కొంత పూర్వ చరిత్రకొరకుగాను 20వ వచనంతో మన చర్చను ఆరంభించుకుందాం:

> ఆయన ఇంటిలోనికి వచ్చినప్పుడు జనులు మరల గుంపుకూడి వచ్చిరి గనుక భోజనము చేయుటకైనను వారికి వీలు లేకపోయెను. ఆయన ఇంటివారు సంగతి విని, ఆయన మతి చలించియున్నదని[5] చెప్పి ఆయనను పట్టుకొనబోయిరి (మార్కు 3:20, 21).

తన "సొంత ప్రజలు" అనడానికి బదులు NIVలో "తన కుటుంబము"[6] అని ఉంది. ఆయనను "పట్టుకొనబోయిరి" అనేది ఆయనను తమతో కూడ యింటికి తోడుకొనిపోనుద్దేశించిరని సూచిస్తుంది. ఆయన వెళ్లగోరినా లేకున్నా.[7]

"క్రీస్తుకు మతి చలించె"నని ఆయన యింటివారును ఆయన స్నేహితులును అనుకొనడంలో ఉన్న ఒకే కారణం ఆయన భోజనం చేయడానికి సమయం తీసికొనలేదన్న వాస్తవమే కావచ్చు.[8] వారు ఆలాటి తీర్మానానికి రావడానికి హేతువైయుండగల పలు సంగతులను విలియం బార్క్లే పేర్కొన్నాడు:[9]

(1) యేసు భద్రతను త్రోసివేశారు. తలవాల్చుటకైన స్థలములేని దిమ్మరియై యుండడానికిగాను, ప్రతివారం డబ్బును సంపాదించే వ్యాపారాన్ని ఏ తెలివిగలవాడు వదులుకుంటాడు?

(2) క్షేమమును గూర్చి యేసు పట్టించుకున్నట్టు లేదు. తనకు అపజయం నిశ్చయం కానున్న యుద్ధాన్ని యూదుల స్థావరమంతటి మీద వివేకము కలిగిన ఏ వ్యక్తి పూను కుంటాడు?

(3) సామాజిక ప్రధాన ప్రవాహమంతటి నుండి తనను తాను ఎక్కువగా వేరు

చేసికొంటున్నాడు. అసహజమైన పలు సంగతులకు సంబంధించిన విద్యలేని పామరులు, వారిలోన ఎక్కువమందికి చేతులు కాయలుకాసి ఉంటాయి, పైగా వారిలో కొందరు సందేహస్పదమైన పేరుగల[10] వారితో ఏ వివేకంగల మనిషి విజయం సాధించ నిరీక్షిస్తాడు?

బర్టన్ కఫ్‌మన్ యిలా వ్రాశాడు:

> ప్రకృతి సంబంధమైన [తిరిగి జన్మించని] మనుష్యులకు దేవుని సేవయందలి ఆసక్తి ఎన్నటికిని అర్థంకాదు. వ్యాపారము, యుద్ధము, విజ్ఞానము, ఆనందము, రాజకీయము, భూసంబంధమైన దాదాపు ఏ వృత్తిలోనైనా కనుపరచే ఆసక్తిని జనులు అభినందిస్తారు, పొగడుతారు, పోటీపడతారు; అయితే పరిశుద్ధమైన భక్తిసేవలో తన్నుతాను పూర్తిగా సమర్పించుకున్న వానిని గూర్చి తలలు ఆడిస్తూ, "అతడు తన మార్గాన పోతున్నాడులే" అని అంటారు.[11]

"ఆయన ఇంటివారు" అని 21వ వచనంలోని వారు, 31వ వచనంలోని "ఆయన సహోదరులును తల్లియు" అని ఉన్నది ఒక్కటేయని మనం నిశ్చయంగా చెప్పలేం. అయితే ఒక క్రమమైన వృద్ధికన్పిస్తుంది: క్రీస్తు "ప్రజలు" ఆయనను పట్టు కొనవలెనని "వెళ్లారు." ఆయన ఉన్నచోటుకు "వెళ్లారు". కొద్ది సమయం గతించింది (22-29 వచనాలు). ఆయన తల్లియు ఆయన సహోదరులును అక్కడికి వచ్చారు (31వ.). 21, 31లో ఉన్న జనులు ఒక్కటేయన్నట్టు గోచరిస్తుంది.

21, 31 వచనాలకు మధ్య ఆలాటి సంబంధమున్నట్టయితే, "తాను పట్టించు కొనకపోయినా," మరియయు యేసు సహోదరులును ఆయనకు సహాయము చేయవచ్చి నట్టయితే, అప్పుడు ఈలాటి ప్రశ్న ఉద్భవించుతుంది: "క్రీస్తు తల్లి ఆలాటి ఏర్పాటుతో ఎందుకు వెళ్లియుంటుంది?" ఆయన సహోదరుల కంటెను ఆయన ఎవరైయున్నది ఆమె ఎక్కువగా ఎరిగినదైయుంది కదా. అది వాస్తవమే. అయినా రెండు విషయాలు మనస్సులో ఉంచుకో: (1) యేసు ఎవరు అనే సంగతి ఆమె గుర్తించినా, ఆమె గ్రహింపు అసంపూర్ణమైనది; (2) తల్లియొక్క అక్కరగల తల్లివలెనే ఆమె యింకా ఉంది. తన బిడ్డ సరిగా తిండి తినకపోతే ఏ తల్లి పట్టించుకోదు? తన కుమారుని మతి సరిగా లేదన్నవారితో ఆమె ఏకీభవించకపోవచ్చు. అయితే ఆయన క్షేమం కొరకు ఆమె సహజమైన అక్కర కనుపరచవచ్చు.[12]

మరియ, యేసు సహోదరుల ఉద్దేశంలో ప్రేమతో కూడిన భావాలను మనం చూడవలసియుంది. ఒక వేళ వారి ఉద్దేశాలు తప్పుగా నడిచిన, వారి జోక్యం కేవలం "ఆయన క్షేమం కొరకేనని" వారు నమ్మియుండవచ్చు.

ఇది మనలను మార్కు 3:31కి తెస్తుంది: అప్పుడు, "ఆయన సహోదరులును తల్లియు వచ్చి" (31ఎ వ.). యేసు ఎక్కడున్నారు? "జనులు గుంపుగా ఆయనచుట్టు కూర్చుండిరి" (31బి వ.). క్రీస్తు యింకను జనులతో మాట్లాడుతున్నారు (మత్తయి 12:46). "జనులు గుంపులుగా ఉండుటచేత ఆయన దగ్గరకు వారు రాలేక పోయిరి" (లూకా 8:19[13]).

మత్తయి 12:46 ప్రకారం "ఇదిగో ఆయన తల్లియు సహోదరులును ఆయనతో మాటలాడగోరుచు వెలుపల నిలిచియుండిరి." వారు యేసు యొక్క శ్రద్ధను తమవైపుకు

మళ్లించ ప్రయత్నించియుండవచ్చు, కాని ఆయన వారి మాటలు చెవిని వేసికొనకపోవచ్చు లేక ఆయన వారిని నిర్లక్షం చేసియుండవచ్చు. అప్పుడు తనతో మాట్లాడవలెనని వారు కబురు పంపినట్టున్నారు. వారు ఒకనితో మెల్లగా ఆయనను పిలువమన్న మాటను నేను వినగలను: "యేసు తల్లియు ఆయన సహోదరులును యిక్కడ ఉన్నారు. వారికి ఆయన కావాలట. ఈ సంగతిని ఆయనకు అందించండి!" అనేకులు[14] క్రీస్తుకు అంతరాయం, కలిగించినా కడకు ఆ సందేశం ముందు వరుసలో కూర్చుండిన వారివద్దకు చేరింది. "వారు – ఇదిగో నీ తల్లియు నీ సహోదరులును వెలుపల ఉండి, నీకోసము వెదకుచున్నారని ఆయనతో" అన్నారు (మార్కు 3:32).

వారి ఉద్దేశాలు మంచివో చెడ్డవో లేక మధ్యస్థమైనవోగాని, ఆయన తన బోధను చాలించేవరకు వేచియుండ నిష్టపడని పొగురుబోతుతనం ఆ కుటుంబానికుంది. "మేము కుటుంబం ఇప్పుడు నీవు ఆపి మమ్మును చూడ రావాలి. నీవు చేస్తున్న దానికంటె మాకు కావలసింది ఎక్కువ ముఖ్యమైనది" అని వారు అంటున్నట్టున్నారు.

## క్రీస్తు యొక్క ఆత్మసంబంధమైన కుటుంబం

యుక్తంకాని విన్నపం క్రీస్తును "బహుగా బాధించిన పరిస్థితులలో ఒకదానియందు, ఆయన భూసంబంధమైన పరిచర్యలో బహు సున్నితమైన చిక్కు స్థితిలో ఆయనను పడవేసింది."[15] ఆయన కుటుంబాన్ని నిరాకరింప ఆయన వెనుకంజ వేసేవారే, కాని వారికిని – తనతో ఉన్నవారందరికిని తన చర్య స్వభావాన్ని, ప్రాముఖ్యతను ఆయన తెలుపవలసిన అవసరముంది.

నేను ఈలాటి చిక్కును ఎదుర్కొనవలసియుంటే, నేను ఏమి చేయాలో తోచని స్థితిలో తడబడి కలవర పడియుండేవాడనే. మాట్లాడుతున్నప్పుడు యిరుకున పెట్టిన స్థితిలో ఒక్క సారి మాత్రమే నా మనస్సు సరిగా పని చేసినట్టు నాకు జ్ఞాపకం ఉంది. ఓక్లహోమాలోని ఒక స్థానిక సంఘ కూడికలో దృశ్య పరికరాలను నేను ప్రదర్శిస్తున్న. వేదిక మీద నేను అటూ యిటూ త్వరత్వరగా తిరుగుతున్నాను. బోధనా పరికరాలతో ఆ వేదిక నిండిపోయింది. ఒకసారి, నేను వెనుకకు అడుగువేశా – క్రిందకు జారి పడబోయాను, కాని తిరిగి కాలు నిలదొక్కుకున్నా, "తాను నిలుచుచున్నానని తలంచువాడు పడిపోకుండా చూచుకోవాలి." అయినా, సాధారణంగా, నేనొక క్రొత్త సమస్యను ఎదుర్కొన్నప్పుడు నిరుత్తరుడనైయుంటా.

ఈ పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు సందర్భ శుద్ధిలేని బోధకుడు ఏమి చేశారు? అసమయమైన ఆటంకాన్ని సమయానుకూలమైన బోధగా మార్చారు. "నా తల్లి యెవరు నా సహోదరులెవరు? అని అడిగారు" (మత్తయి 12:48). "పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహోదరియు, నా తల్లియు ననెను" (మత్తయి 12:50).

క్రీస్తు ప్రభువు ఈ మాటలు పలికినప్పుడు, ఆయన తన కుటుంబాన్ని కించపరచలేదు.[16] తమ సొంత కుటుంబాలతో సంబంధాలు తెంచుకోవలెనని కొన్ని తెగలవారు నిర్బంధం చేస్తారు, కాని క్రీస్తు ప్రభువు ఆలాటి సూత్రాన్ని బోధించలేదు

సరిగదా, ఆయన దానిని ప్రోత్సహించనూ లేదు. ఆయనకు కుటుంబం ముఖ్యమే. తమ తల్లిదండ్రులను ఘనపరచనందుకు ఆయన శాస్త్రులను పరిసయ్యులను తీవ్రంగా ఖండించారు (మత్తయి 15:1–8). తాను మరణించకముందు చేసిన వాటిలో చివరి కార్యము తన తల్లి సంరక్షణను ఆలోచించాడు (యోహాను 19:26, 27). విలియం ఆర్నాట్ యిలా వ్రాశాడు:

> ఆయన తల్లినీ, సహోదరులనూ కుమారుడు, అన్న అనే నిజమైన మక్కువతో ఆయన ప్రేమించారు. తాను శిశువైనప్పుడు పరుండిన రొమ్మును ఆయన యువకుడు, మనుష్యుడై యున్నప్పుడు ఎన్నడే చీల్చలేదు. తన జన్మనుండి తన్ను పెంచిన స్త్రీని తన మరణ పర్యంతము ప్రియముగానే నిలుపుకున్నాడు.[17]

అయినను, భూసంబంధమైన బాంధవ్యం కంటె గాఢమైనది, ఎక్కువ ప్రశస్తమైనది, బహు స్థిరమైనది ఒకటుందన్న సంగతిని ప్రభువు తేటపరచదలచుకున్నాడు.

ఈ విషయాన్ని గుర్తింపజేయడానికిగాను ''తన చుట్టు కూర్చున్న వారిని కలయచూచి – ఇదిగో నా తల్లియు నా సహోదరులును" అని ఆయన అన్నారు (మార్కు 3:34). మత్తయి ప్రకారం, "తన శిష్యులవైపు చెయ్యిచాపి– ఇదిగో నా తల్లియు నా సహోదరులును; పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహోదరియు నా తల్లియు ననెను"[18] (మత్తయి 12:49, 50).

శిష్యులు క్రీస్తు యొక్క "సోదరులు," "సోదరీమణులు," లేక "తల్లియై"యుంటారని[19] నీవు అక్కర చూపనవసరం లేదు. క్రైస్తవులను ఆయన మూడు రకాలైన తెగలుగా ఆయన విభజించ లేదు. అయితే, "పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువారెవరైనా నా కుటుంబం, ఆత్మసంబంధమైన నా కుటుంబమని" ఆయన తేటైన విధంగా అన్నారు. లూకా పదజాలాన్ని ఉపయోగించితే, "దేవుని వాక్యము విని, దాని చొప్పున జరిగించే వీరే" తన కుటుంబమైనట్టు ప్రభువు నొక్కి చెప్పారు (లూకా 8:21).

మత్తయి, మార్కులో, తండ్రి "చిత్తము" జరిగించుటను గూర్చి తెలియజేయగా, లూకాలో "దేవుని వాక్యము" అనే పదప్రయోగం ఉపయోగింపబడింది. ఇందులో ఏ విరుద్ధ భావమూ లేదు. దేవుని చిత్తాన్ని ఎరుగ గలిగే ఏకైక మార్గము ఆయన వాక్యము ద్వారానే.

ప్రభువు కుటుంబంలో మనం భాగమైయుంటే, మొదట మనం దేవుని వాక్యము వినాలి, తరువాత దాన్ని చేయాలి (మత్తయి 7:21–27 చూడు).[20] చేయుటలో యిమిడి ఉన్న విషయమేమి? "చేయ"డానికి ఆయన బోధించునదంతయు నమ్మాలి. అది ఆజ్ఞాపించున దానినంతటికి లోబడాలి, అది వాగ్దానం చేయుదాని నంతటిని నిరీక్షించాలి.[21]

ప్రభువు భూమిమీద ఉన్న కాలంలోని యూదులకు ఈ పాఠం కావాలి. అబ్రహామునుండి లౌకికమైన సంతతిగా వచ్చినందున దేవుని కుటుంబంలో భాగమయ్యుంటామని వారు ఎల్లప్పుడు తలంచేవారు (లూకా 3:7–9; యోహాను 8:39లను చూడు). భౌతికమైన బంధుత్వం దేవుని కుటుంబంలో స్థానముంటుందనే (గ్యారంటీ) హామి ఏదీలేదు (రోమా 9:6, 7 చూడు). క్రీస్తును వెంబడింప తీర్మానించుకొనడంతో అబ్రహాము సంతతి సాటికాదు. ముఖ్యమైనది వంశపారంపర్యం కాదు

కాని, కార్యాచరణయే. తండ్రితో వారికి కొనసాగే బాంధవ్యం కావాలంటే ఆయన మాట విని దాని చొప్పున చేయాలి.

నీకు నాకు కూడా ఈ పాఠం అవసరమే. దేవుని వాక్యం వినడం ప్రాముఖ్యం (రోమా 10:17). అనుదినం బైబిలు చదవడం కోరదగినదే (అపొ. 17:11), ప్రతి బైబిలు తరగతి, ఆరాధనా కార్యక్రమమునకు హాజరు అవడం యుక్తమైనదే (హెబ్రీ 10:25). తాను ప్రసంగిస్తుండగా జనులు బైబిళ్లు తెరిచి నోట్సు వ్రాసికొనడం చూస్తే ముగ్ధుడౌతాడు (కీర్తన. 119:16 చూడు). కాని, ఇవి ఎంతగా మెచ్చుకోదగినవైనా, వాటివలననే "ప్రయోజనముండదు"[22] – ఒకడు కేవలం వాక్యం విని వాటి చొప్పున గైకొనకుంటే, ప్రభువైన యేసు తరువాత మరియకు జన్మించిన యాకోబు యిలా అన్నాడు: "మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్య ప్రకారము ప్రవర్తించువారునై యుండుడి" (యాకోబు 1:22).

అప్పుడు, మనం క్రీస్తు యేసుకు రెండు కుటుంబాలున్నట్టు చూచాం – మొదటిది భౌతికమైనది, రెండవది ఆత్మసంబంధమైనది. ప్రభువునకు విధేయులగుటవలన మొదటిది రెండవదానిలో భాగమయ్యే అవకాశమున్నట్టు ప్రభువు బోధించారు. భౌతికమైన కుటుంబం ఎంత ముఖ్యమయ్యిందో దాని కంటెను ఆత్మ సంబంధమైన కుటుంబం ఎంతో ప్రాముఖ్యమై యున్నదని ఆయన నొక్కి చెప్పారు.

## క్రైస్తవుని రెండు కుటుంబాలు

నీవు, నేను ఏ రెండు కుటుంబాలకు చెందగలమో దానివైపు మన దృష్టిని యిప్పుడు మరల్చుదాం.

**భౌతిక కుటుంబాలు.**

నేను Dave H. మరియు Lillian Roper అనే నా తల్లిదండ్రులతోను కాయ్ అనే నా సహోదరునితోను నేను దీవించబడ్డాను. మరియు Jo అనే ఒక క్రైస్తవ స్త్రీ భార్యగా ఉండేలా కూడా నేను దీవించబడ్డాను. మాకు Cindy, Debbie, Angi అనే ముగ్గురు కుమార్తెలతోను; Richard Honaker, Dan Lovejoy అనే ఇద్దరు అల్లుళ్లు; Seth David, Rachel అనే యిద్దరు మనమ సంతానంతో కూడ దీవించబడ్డాను. వీరును కుటుంబంలో యింకా యితరులు నాకు నా ప్రాణంకంటె మిన్నయైయుంటారు.

నీవు కూడా ఒక భౌతికమైన కుటుంబంలో పుట్టావు. అది క్రైస్తవ కుటుంబమై యుంటుందని నేను నిరీక్షిస్తున్నాను. ఒక వేళ అదికాకపోయినా, నిన్ను లక్ష్యపెట్టి నీ అవసరతలను తీర్చే ప్రజలు నీకున్నారు. నాకు లాగా నీవు వివాహితుడవై బిడ్డలను కలిగియుండవచ్చు – లేకపోవచ్చు. నీ పరిస్థితి ఏమైనా – కుటుంబం యొక్క ప్రాథమిక విలువను నీవు అభినందిస్తున్నావని నిరీక్షిస్తున్నాను. అది నరుల కొరకైన దేవుని తొలి సంస్థయైయుంది (ఆది. 2:18, 21–24; 4:1), అది నేటికినీ, సమాజానికి మూల రాయియై ఉంది.

విషాదకరంగా, కుటుంబమనేది ఎంత ముఖ్యమయ్యిందో నేడు కొందరు గ్రహింపకున్నారు. కొందరు తమ కుటుంబాలను విడిచిపెట్టారు, మరి కొందరు వాటిని అలక్ష్యం చేశారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను సంరక్షించరు, కొందరు పిల్లలు ముసలితనంలో తమ తల్లిదండ్రులను లక్ష్యపెట్టరు. ఆ సందర్భంలో పౌలు యిలా రాశాడు: "ఎవడైనను స్వకీయులును, విశేషముగా తన యింటివారిని, సంరక్షింపక పోయినయెడల వాడు విశ్వాసత్యాగము చేసినవాడై అవిశ్వాసికన్న చెడ్డవాడై యుండును" (1 తిమోతి 5:8). మరియు పిల్లలు, మనుమలు –"మొదట తమ యింటివారి యెడల భక్తి కనుపరచుటకును, తమ తల్లిదండ్రులకు ప్రత్యుపకారము చేయుటకును నేర్చుకొనవలెను; ఇది దేవుని దృష్టికనుకూలమైనది" (1 తిమోతి 5:4).

**ఆత్మ సంబంధమైన కుటుంబం**

భౌతికమైన కుటుంబం ఎంత ముఖ్యమైనదో మనం గ్రహించినట్టయితే, అప్పుడు ఈ క్రింది ప్రతిపాదన అధికమైన భావాన్ని చేరుతుంది: ఆత్మసంబంధమైన కుటుంబం, దేవుని కుటుంబం అంతకంటే ఎంతో ఎక్కువైన ప్రాముఖ్యతను కలిగియుంది. ఎఫెసులోని క్రైస్తవులకు పౌలు ఈ విధంగా వ్రాశాడు: "కాబట్టి మీరికమీదట పరజనులునైయుండక, పరిశుద్ధులతో ఏకపట్టణస్థులును దేవుని యింటివారునైయున్నారు" (ఎఫెసీ. 2:19). ''ఇంటి వారు'' అనేది కుటుంబం అనడానికి మరో రూపం. ''మీరు దేవుని కుటింబికులునైయు"న్నారని The New Century Version తర్జుమా చేసింది. గలతీ. 6:10లో "విశ్వాస గృహమునకు చేరినయెడలను"[23] అని వ్రాయబడింది. 1 పేతురు 4:17లో అది, "దేవుని యిల్లు" అని సూచింపబడింది.

ఆత్మసంబంధమైన కుటుంబమేది? పౌలు దాన్ని సంఘమని పిలుస్తున్నాడు ... "దేవుని మందిరములో అనగా జీవముగల దేవుని సంఘములో, జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను" అని పౌలు తిమోతికి తెలిపాడు ( 1 తిమోతి 3:15).

ఈ కుటుంబములో దేవుడు మన తండ్రి (మత్తయి 6:9; రోమా 1:7), మనము ఆయన పిల్లలమైయున్నాము (యోహాను 1:12, 13; రోమా 8:14, 15; ఎఫెసీ. 5:1; ఫిలిప్పీ. 2:15; 1 యోహాను 3:1, 2). పౌలు యిలా వ్రాశాడు: "మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతోకూడ సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము; క్రీస్తుతోకూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడినయెడల, క్రీస్తుతోడి వారసులము" (రోమా 8:16, 17). దేవుని నుండి అపొస్తలుడు ఈ మాటలను కోట్ చేస్తున్నాడు: "– మరియు నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినైయుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునైయుందురు ..." (2 కొరింథీ. 6:18). ఈ ఆత్మ సంబంధమైన యింటిలో, సంఘములోని సభ్యులు మనకు సహోదరులు సహోదరీలునై యుంటారు. (అపొ. 6:3; రోమా 16:1; 1 కొరింథీ. 7:15; ఫిలేమోను1, 2; యాకోబు 2:15).[24]

ఈ కుటుంబంలో మనం ఎలా భాగమైయుంటాం? దేవుని వాక్యము విని దాని

ప్రకారం చేస్తే, మనం ఆ కుటుంబంలో భాగమైయుంటామని ప్రభువు తెలియజేశారు. "క్రొత్త జన్మవలన" మనము (దేవుని కుటుంబమై) దేవుని పిల్లలమైయుంటామని యోహాను రాసాడు (యోహాను 1:11-13; 3:3, 5). క్రీస్తునందు విశ్వాసముంచి, తమ పాపముల విషయమై మారుమనస్సు పొంది, బాప్తిస్మం పొంది, బాప్తిస్మం (నీటియందు ముంచడం) పాపక్షమాపణ కొరకు పొందితే దేవుని కుటుంబమైన సంఘములో భాగమైయుంటామని లూకా దాఖలు చేశాడు (అపో. 2:36-38, 41, 47;[25] 1 కొరింథీ. 12:13 చూడు). అంటే, దేవుని కుటుంబంలో భాగమై ఉండడానికి మూడు విధానాలున్నాయని దీని అర్థం కాదు. ప్రభువైన యేసు, యోహాను, లూకాలు తెలిపేది ఒకే విధానం. ఆ విధానమేది?

మనకు వాక్యముంది, అది విశ్వాసాన్ని పుట్టిస్తుంది (రోమా 10:17). అప్పుడు - మన పాపముల విషయమై మారుమనస్సు పొందుటయందును (లూకా 13:3), యేసునందు మన విశ్వాసమును ఒప్పుకొనుటయందును (మత్తయి 10:32), బాప్తిస్మం పొందుట వలనను (మార్కు 16:16; అపో. 22:16) మనము వాక్యమును జరిగించిన వారమౌతాం. మనం అలా చేసినప్పుడు, మనము నీటి మూలముగాను ఆత్మమూలము గాను జన్మించిన వారమౌతాము (యోహాను 3:5). దేవుని కుటుంబలోనికి చేర్చబడతాం. పేతురు యిలా వ్రాశాడు: "మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్రపరచుకొనినవారై ... శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమూలముగా అక్షయ బీజమునుండి పుట్టినవారు ..." (1 పేతురు 1:22, 23). ఈ విధంగా మనము దేవుని కుటుంబ సభ్యులమై ఉంటాం.

లౌకికమైన కుటుంబాన్ని బట్టి నేను దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాను. సంఘమను ఆత్మ సంబంధమైన ఆయన కుటుంబం కొరకు మరి ఎక్కువగా చెల్లిస్తున్నాను. ఈ రెండింటికి సంక్షిప్త పోలికయుంది: భౌతికమైన కుటుంబం, ఆత్మసంబంధమైన కుటుంబం అనే రెండును దేవుని సంస్థలే. మొదటిది ప్రకృతి సంబంధమైనది- రెండవది ప్రకృతికి అతీతమైనది. మొదటి దానిలోకి లౌకికమైన జన్మవలన ప్రవేశం లభిస్తుంది. రెండవ దానిలోకి ఆత్మసంబంధమైన జన్మవలన ప్రవేశం లభిస్తుంది. మొదటిది పుట్టుకకు లేక తరమునకు సంబంధించింది, రెండవది పునర్జన్మకు సంబంధించింది (తీతు 3:5). మొదటి కాలానికి చెందింది (మత్తయి 22:30). రెండవదైతే కాలానికీ నిత్యత్వానికీ చెందినదైయుంది (హెబ్రీ 12:23). మొదటిది ప్రధానమయింది లేక ముఖ్యమయింది; రెండవది అవసరమయింది.[26] మొదటిది మంచిది; రెండవది శ్రేష్ఠమైనది. నేను యింకో సంగతి చెప్పవలసియుంది: రెండింటి ప్రవేశానికి శ్రమ అవసరమయ్యింది. మొదటిదానికి తల్లి శ్రమ, రెండవదానికి క్రీస్తు ప్రభువు శ్రమ -సిలువపై పాపములకొరకు (అపో. 20:28; ఎఫెసీ. 5:23, 25).

బాంధవ్యము (బంధుత్వము) ఉమ్మడి అనుభవము, ఉమ్మడి అభిలాష, ఉమ్మడి విధేయత, మరియు ఉమ్మడి గురియందు ఉంటుందని విలియమ్ బార్క్లే వ్రాశాడు.[27] ఇవన్నీ దేవుని కుటుంబమనే, సంఘమందు మనం కనుగొనగలం. శరీర సంబంధమైన తన అన్నదమ్ములు అక్కచెల్లింద్రకంటెను సంఘ సభ్యులతోనే తాము సన్నిహితంగా ఫీలైనట్టు సంఘ సభ్యులు చెప్తూతూ ఉండగా నేను ఎన్నిసార్లు విన్నానో చెప్పలేను.

దేవుని కుటుంబంలో ఉండడం ఎంత అద్భుతమో నేను మాటలతో చెప్పలేను. రాజు ఉన్న దేశంలో రాజకుటుంబ సభ్యుడైయుండడం గౌరవంతో కూడినదై ఉంది. కోటీశ్వరుడు ఒకనికి తండ్రియైయుండడంలో లెక్కలేనన్ని ఆధిక్యతలుంటాయి. ఏది యెలాగున్నా, ప్రభువు కుటుంబంలో దేవుడు తండ్రియైయుండే దానితో నీవు దేనిని పోల్చలేవు! కీర్తి శేషుడై C. R. నికోల్స్ "లోకమే తమ సొంతమైనట్టు" తాను నడుస్తానని ఒకసారి చెప్పాడు. "నా తండ్రి చేస్తాడు" అని గౌరవనీయుడైన ఆ సువార్తికుడు అనే వాడు!

ఆత్మ సంబంధమైన కుటుంబం అంత ప్రాముఖ్యమైనదై యున్నందున, ఆ కుటుంబానికి మనకుండే వీడని విశ్వాసము లేక భక్తి[28] తక్కిన విశ్వాసములన్నిటిని అధిగమించినదైయుండాలని ప్రభువైన యేసు బోధించారు. లూకా 14:26లో ఉలికిపడే మాటలను ఆయన పలికారు: "ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నాకు శిష్యుడు కానేరడు" (లూకా 14:26). "క్రీస్తు పలికిన కఠినమైన మాటలు" అనే అంశం మీద వరుసగా ప్రసంగాలు చేయడానికి తన రేడియో శ్రోతలనుండి ఒకసారి అంశాలను Gordon Powell ఆహ్వానించాడట. ఏ యితర లేఖన భాగం కంటెను అధికంగా లూకా 14:26 మీద ప్రసంగించుమని విన్నపాలు వచ్చాయట.[29]

"ద్వేషము" అనే పదానికి అర్థం నీవు యింతకుముందే గ్రహించియుంటావనుకుంటా. సాధారణంగా ద్వేషమంటే మనం ఏ భావం చెప్పుతామో లూకా 14:26లో అర్థం అదికాదు. లేకుంటే ప్రభువు అసంబద్ధంలో పడియుండేవాడే. కొండమీద ప్రసంగంలో శత్రువులను ప్రేమించుమని ఆయన బోధించారు (మత్తయి 5:44). శత్రువులను ప్రేమించుడని బోధించిన ప్రభువు తన సొంత యింటివారిని ద్వేషించుడని చెప్పియుండరు.

కొన్నిసార్లు "ద్వేషము" అనే పదం బైబిలులో "తక్కువగా ప్రేమించు" అనే అర్థంతో వినియోగించబడుతుంది (ద్వితీయో. 21:15; KJVలో చూడు). లూకా 14:26లోని ప్రతిపాదనను మత్తయి 10:37లో పోల్చినప్పుడు "ద్వేషము" అనే పదానికి అర్థం తేటపడుతుంది: "తండ్రినైనను తల్లినైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు; కుమారునైనను కుమార్తెనైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు." లూకా 14:26లో క్రీస్తు ప్రభువు చెప్పుతున్నదేమంటే – ఆయనను, తండ్రియైన దేవుని ప్రేమించేదానికంటె లౌకికమైన కుటుంబాలను తక్కువగా ప్రేమించాలి – అనేదే.

లూకా 14లోని మాటల ప్రాబల్యం పోకుండునంతగా జాగ్రత్తపరచుతూ, వాటి బలము తగ్గిపోకుండునట్లు మనం చూచుకోవాలి. దేవుని కొరకును, ఆయన కుటుంబం కొరకును మన ప్రేమ ఎంత అధికం కావాలంటే, అది పోల్చిచూచినప్పుడు, మన భౌతికమైన కుటుంబాలకు మనం చూపే ప్రేమ, ద్వేషము అన్నట్టు ఉండాలి.[30]

అంటే, దీనికి అర్థం మన లౌకిక సంబంధమైన కుటుంబాలను అశ్రద్ధ చేయడం ఏమాత్రమూ కాదని నేను తిరిగి నొక్కి చెప్పుతున్నాను. దేవుని సంఘ/రాజ్యమును మొదటిగా ఉంచే అనేకులు (మత్తయి 6:33) లౌకికమైన తమ కుటుంబాలలోని బాంధవ్యాలు

హెచ్చింపబడినట్టు కనుగొంటారు (ఎఫెసీ. 5:25, 28, 33; 6:1–4).[31] "[ఆత్మ సంబంధమైన కుటుంబానికి వీడని నమ్మకత్వం మొదట కలిగియుండాలనే] ఈ చట్టాన్ని అనుసరించడమే ... భూసంబంధమైన మన కుటుంబాలకు మనం యివ్వగల అతి శ్రేష్ఠమైన సేవయైయుంటుంది."[32] అని William Hendriksen అన్నాడు.

## మీ రెండు కుటుంబాలు

ప్రభువైన యేసు యొక్క రెండు కుటుంబాలను గూర్చియు, క్రైస్తవుని రెండు కుటుంబాలను గూర్చియు మనం మాట్లాడుకున్నాం. ఇప్పుడు మనం రెండు కుటుంబాలను గూర్చి కొంచెం దగ్గరకు వచ్చి మాట్లాడుకుందాం.

### పొందికలో రెండు

నీ రెండు కుటుంబాలు కలగలుపు అయినప్పుడు "రెండు లోకముల శ్రేష్ఠమైనది" నీకుంది. కొంచెం సేపు, మనం ఆరంభించిన కథవద్దకు తిరిగి వెళ్లుదాం. మామూలుగా, సంఘటనను దాఖలుచేసి, దాని తరువాత కలిగిన ఫలితాన్ని గూర్చి తెలియజేయడానికి రచయిత శ్రద్ధ చూపినట్టు కన్పించదు. క్రీస్తు వారి గద్దింపు తరువాత, ఆయన తల్లియు ఆయన సహోదరులును దగ్గర నిలిచియున్నారు? ఆ జన సమూహమునకు బోధించుట ముగించిన పిమ్మట, ప్రభువు తన కుటుంబాన్ని సందర్శించారా? మనకు చెప్పలేదు. ఒక విషయం మనం నిశ్చయత కలిగియుండవచ్చు: తన పనినుండి ఆయనను నిరుత్సాహపరచడానికి వారికిగాని మరి యింకెవరికేగాని ఆయన అవకాశం యివ్వలేదు. R and R[33] బలవంతం చేత ఆయనను ఎవడును యింటికి లాగుకొని పోలేదు. తన పనిలో విరామం దొరికినప్పుడు యేసు తన యింటికి అలక్ష్యం చేయలేదని మనం నిశ్చయం కలిగియుండవచ్చు. తన జీవితపు వివరణలో, ఆయన తల్లియు ఆయన సహోదరులును తిరిగి ప్రత్యక్షమౌతారు. క్రీస్తువారితో సంబంధాలు తెంచుకున్నట్టు ఏ సూచనా లేదు (యోహాను 7:2–10; 19:25–27).

తన కుటుంబంతో క్రీస్తు సంబంధానికి తిరిగి రావడంతో నా ఉద్దేశం, ఈ కథకు సంతోషకరమైన అంతముందని నొక్కి చెప్పడానికే. చివరికి, తన సహోదరులు తనయందు నమ్మిక ఉంచ వచ్చారు. ఆయన పునరుత్థానంలోని ఒక ప్రత్యక్షత తన సహోదరుడైన యాకోబునకు యివ్వబడింది (1 కొరింథీ. 15:7). పరిశుద్ధాత్మ కొరకు అపొస్తలులు యెరూషలేములో వేచియున్నప్పుడు, ఆయన తల్లియు, ఆయన సహోదరులును వారితో ఉన్నట్టు కన్పిస్తారు (అపొ. 1:14). యెరూషలేము సంఘములో యాకోబు ఒక నాయకుడుగా రూపొందాడు (అపొ. 12:17; 15:13; 21:18; గలతీ. 1:19) మరియు అతడు యాకోబు పత్రికను వ్రాశాడు (యాకోబు 1:1). తక్కిన సహోదరులు కూడా ఆయా స్థానిక సంఘాలలో పనిచేసినట్టు సంఘ చరిత్ర కారుడైన ఇసూబియస్ అన్నాడు (1 కొరింథీ. 9:5 కూడా చూడు).

మరోవిధంగా చెప్పాలంటే, క్రీస్తు లౌకిక కుటుంబం, ఆత్మసంబంధమైన తన

కుటుంబంలో భాగమయ్యింది! నా తల్లి తండ్రులు క్రైస్తవులు; నా భార్య క్రైస్తవురాలు, నా ముగ్గురు కుమార్తెలు మరియు యిద్దరు అల్లుళ్ళు క్రైస్తవులు; నా మనుమ సంతతిలో పెద్ద బిడ్డ, యిటీవల బాప్తిస్మం పొందాడు. అందుకు నేను ఆనందిస్తున్నాను! దేవుని సింహాసనం చుట్టు నా ప్రియులతో కూడా నిలిచి ఆయన స్తుతులను పాడడం కంటె హెచ్చయిన కోర్కె నాకు లేదు.[34]

ఈలాటి ఆనందాన్ని నీవు ఎరగాలనేది నా ప్రార్థనయైయుంది.

## సంఘర్షణలో రెండు

విషాదమేమంటే, రెండు కుటుంబాలు అన్ని సమయాల్లో కలసి ఉండకపోవచ్చు. కొన్నిసార్లు తీవ్రమైన సంఘర్షణ ఏర్పడుతుంది. దీన్ని ప్రభువారు ఎదురుచూచే యిలా అన్నారు:

> నేను భూమిమీదికి సమాధానమును పంపవచ్చితినని తలంచకుడి; ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు. ఒక మనుష్యునికిని వాని తండ్రికిని, కుమార్తెకును ఆమె తల్లికిని, కోడలికిని ఆమె అత్తకును విరోధము పెట్టవచ్చితిని. ఒక మనుష్యుని యింటివారే అతనికి శత్రువులగుదురు (మత్తయి 10:34-36).

ఆయన తన శిష్యులకు యిలా తెలియజేశారు: "తలిదండ్రులచేతను సహోదరులు చేతను బంధువులచేతను స్నేహితుల చేతను మీరు అప్పగింపబడుదురు; వారు మీలో కొందరిని చంపింతురు;" (లూకా 21:16). కుటుంబాల్లో పొందిక లేమి ఉండాలని క్రీస్తు కోర్కె అయినట్టు ఈ లేఖనాల భావం కాదు. కాని, సువార్త యొక్క స్వభావం ఆయన ఎరుగు. దానికి కావలసిన సమర్పణను లౌకికులు గ్రహించలేరు. అందువలన కొన్ని సార్లు సంఘర్షణ తప్పని సరియౌతుంది.

నేను మాట్లాడుతున్నదేమో మీలో కొందరికి తెలుసు. తన వ్యక్తిగతమైన అవసరతల కంటెను దేవుని పనిని ప్రధానంగా ఎంచినందున, ప్రభువు కుటుంబమును, స్నేహితులును ఆయనకు మతిచెలించినట్టు తలంచారు. ఏది సరియైనదో దాన్ని నీవు చేసినందున "వెర్రివాడని" నీవు పిలువబడవచ్చు. అలాగైతే, అది కష్టంగానే ఉంటుంది, కదా?

నీ యింటిలోను, నీ స్నేహితుల మధ్యను సమస్యలు రేపుకొనడానికి నీ మార్గం నుండి తొలిగి పొమ్మని నేను సలహాయివ్వడం లేదు. "శక్యమైతే మీ చేతనైనంత మట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి" అని పౌలు అన్నాడు (రోమా 12:18).[35] ఇతరులతో సమాధానంగా ఉండ నీవు ప్రయాసపడినా, సరే, నీ కుటుంబం నిన్ను విడిచిపెట్టినట్టయితే, ప్రభువు నిన్ను విడనాడదని ఎరుగుటలో ఆదరణ పొందు. (హెబ్రీ. 13:5). ఆయన వాగ్దానాన్ని ఆలకించు:

> అందుకు యేసు ఇట్లనెను – నా నిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్క చెల్లెండ్రనైనను తలిదండ్రులనైనను పిల్లలనైనను భూములనైనను విడిచినవాడు ఇప్పుడు హింసలతోపాటు నూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను

అక్కచెల్లెండ్రను తల్లులను పిల్లలను భూములను, రాబోవు లోకమందు నిత్యజీవమును పొందునని మితో నిశ్చయముగా చెప్పుచున్నాను (మార్కు 10: 29, 30).

## ముగింపు

మీ రెండు కుటుంబాలు ఒక దానితో ఒకటి కలసి ఉండాలన్నది నా ప్రార్థనయై ఉంది. ఒకవేళ పరిస్థితి ఆలాటిది కాకుంటే, దేవుని కుటుంబమైన సంఘంలోనికి వారిని రప్పించడానికి నీ శక్తియంతటిని ధారపోయుమని నిన్ను కోరుతున్నాను. ఈ కార్యసాధనలో, యింత కంటె గొప్ప దేదీలేదు. ఒకవేళ నీవు ఈ లక్ష్యసాధనలో విఫలుడవైనా, నీవు చేయగలిగిదంతా చేశావన్న తృప్తి మిగిలిపోతుంది.

దీన్ని సాధించడానికి ఏ నిరీక్షణ కావాలన్నా, మొదటిగా నీవు దేవుని కుటుంబంలో నమ్మకమైన సభ్యుడవైయుండాలి. "వెంబడించువాని నుండి" కుటుంబంలోనికి నీవు వచ్చావా? నమ్మి బాప్తిస్మం పొందడంవలన నీవు "తిరిగి జన్మించావా?" ఆయనతో మనకున్న బాంధవ్యాన్ని బహు తీవ్రంగా నీవు ఆలోచించాలని ఆయన కోరుతున్నాడు. మేము నీకు సహాయం చేయగలిగితే, మాకు తెలియజేయుము.

---

సూచనలు

[1]"విరామంలేని దినం" అనే పరిచయం చూడు. [2]"క్రీస్తు జీవితం, భాగం 1లో" మరియ, యోసేపుల చర్చను చూడు. [3]"క్రీస్తు జీవితం, భాగం 1ని" చూడు. [4]యోహాను 7:3, 4ను 5వ వచనపు వెలుగులో చూడాలి. [5]ఒక సందర్భంలో క్రీస్తు శత్రువులు ఆలాటి నేరారోపణను చేశారు (యోహాను 10:20). దేవుని సేవకులైన యితరులు కూడా అలాగే నిందింపబడ్డారు (2 రాజులు 9:11; అపొ. 26:24, 25). [6]పుట్‌నోట్ మీద చర్చను చూడు. [7]పుట్‌నోట్ రివ్యూ చేయి. [8]మా ప్రాంతంలో "కేవలం దీన్ని ఆకరి తృణం" అంటారు. [9]Willam Barclay, *The Gospel of Mark*, rev. ed., The Daily Study Bible Series (Philadelphia: West Minister Press, 1975), 76-77. [10]ఆమెరికాలో "ఎర్రని – కంఠం, అల్ప – జీవితాలు, అవిక్షిప్తం" అని అంటారు.

[11]James Burton Coffman, Commentary Mark (Austin, Tex.: Firm Foundation Publishing House, 1975), 63. [12]మరియ బంధువుల కుమారుడు (బాప్తిస్మమిచ్చు యోహాను) యింతకుముందే బంధింపబడ్డాడు. అతని మరణం ఆసన్నమయ్యింది. ఏ తల్లికి అక్కరలేకుండా ఉంటుంది? [13]ఈ లేఖన భాగాన్ని మార్కు 2:1, 2తో పోల్చి చూడు. [14]"వారు ఆయనతో చెప్పిరి" అని వర్ణనలో ఉంది. [15]Charles R. Erdman, *The Gospel of Mark* (Philadelphia: Westminister Press, 1967), 74. [16]గత పాఠం తరువాత ఈ ప్రసంగం చేయతల్చుకుంటే "మరల నన్ను నొక్కి చెప్పనివ్వండి" అని శ్రోతలకు చెప్పవలసి వస్తుంది. [17]William Arnot, *Lesser Parables of Our Lord* (Grand Rapids, Mich.: Kregel Publications, 1884), 115. [18]ఆ జాబితాలో క్రీస్తు "తండ్రి" అని చేర్చలేదు. అది కేవలం దేవునికి రిజర్వ్ చేయబడింది (మత్తయి 23:9). [19]సంఘంలో కొంత కాలం ఉన్నవారికి, సోదరులు, సోదరీలు, తల్లులు సహా ఉన్నట్టు గుర్తిస్తారు (1 తిమోతి 5:1, 2). [20]దేవుని చిత్తాన్ని నేడు మనం క్రీస్తు ద్వారా తెలిసికొంటామని నొక్కి చెప్పు (మత్తయి 11:27) కావున, దేవుని చిత్తమును విని, చేయుటకు మనం క్రీస్తు ఏమి బోధించారో వాటిని విని, చేయాలి.

[21]R. C. H. Lenski, *The Interpretation of St. Luke's Gospel* (Minneapolis: Augsburg Publishing House, 1946), 461. [22]గలతీ 5:2 KJV చూడు. ఈలాటిదే మార్కు 8:36; హెబ్రీ 4:2; యాకోబు 2:14, 16ల్లో కూడా ఉంది. [23]దేవుని కుటుంబాన్ని సూచించే మరో లేఖనం ఎఫెసీ. 3:15. [24]ప్రభువు మనలను తన సహోదరులని పిలుస్తారు (హెబ్రీ 2:11). [25]అపొ. 2:47లో "సంఘము" అని వాడింది. సంఘ/ రాజ్యమనే భావన

అప్పటికి బాగుగా ఎరుకలో ఉన్నందున (మత్తయి 16:18, 19), అపో. 2లో స్థాపింపబడిన సంఘాన్ని "వారు" అనడం జరిగింది (అపో. 1:6–9; 2:1–4). [26]పరలోకం వెళ్లగోరితే దేవుని ఉద్దేశాలను నీవు భూమిమీద నెరవేర్చవలసియుంటుంది. [27]Willam Barclay, *The Gospel of Mark*, rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminister Press, 1975), 82-83. [28]లూకా 9:59–62 కుటుంబ, తప్పు ప్రాధాన్యతల ఉదాహరణగా ఉపయోగించవచ్చు. [29]Gordon Powell, *Difficult Saying of Jesus* (N.p.: Fleming H. Revell Co., 1962), 21. [30]ఈ వాక్యమునకు వివరణ అవసరమైతే కొన్ని ఉదాహరణలను ఉపయోగించు.

[31]యితర కుటుంబ సభ్యుల మీద ద్వేషం కలిగియుండుట బాంధవ్యం కుంటుపడుతుంది. దీనిని ప్రసంగంలో చెప్పాను. [32]Willam Hendriksen, New Testament Commentary: *The Gospel of Luke* (Grand Rapids, Mich.: Baker Book House, 1978), 437 [33]R+R విరామము, వినోదము. శిఖరం నుండి పడద్రోయకుండ ఒక గుంపు నుండి తప్పించుకొన్న యేసు నలుగురు సహోదరులు తన్ను ఈడ్చుకొనిపోకుండ ఆపగలడు (లూకా 4:28–30). [34]"నేను పరలోకమునకు వెళ్లిన రాత్రి (David Roper, Broken Arrow, Okla.: Christian Communication, n.d.) 11-12. [35]1 పేతురు 3:1–6లోని సంగతులు క్రైస్తవులైన భార్యలు గమనించాలని పేతురు తెలిపాడు.